

# మాటా మంతీ

## - సాయి పద్మ



*8*

# సగం స్నానం – తల్లి దినం

చాలా హడావిడిగా , గాభరాగా జెట్ లాగ్ శేషంతో రాస్తున్న కాలం ఇది. అమెరికా నుండి వచ్చేసాక.. మా విసాపట్నం నిజానికి ఉక్కునగరం కంటే ఉక్క'నగరం లాగే తోచింది. దానికి తోడు, వచ్చేటప్పుడు సింగపూర్ ఎయిర్ లైన్స్ వాళ్ళు పెట్టిన పనిష్మెంట్ ఒకటి. ఫ్లైట్ లో బాత్రూం సరిగ్గా లేకపోవటం, సపోర్ట్ ఇవ్వటంలో వాళ్ళ నిర్లక్ష్య ధోరణి ఇవన్నీ నన్ను బాగా, శారీరకంగా దాని వాళ్ళ మానసికంగా  ఇబ్బంది పెట్టింది. వాటి గురించి మళ్ళీ మరోసారి రాస్తాను.

ఇకపోతే, అమెరికా లో నన్ను ఆశ్చర్యపరచినది – సగం స్నానం , అదేంటీ సగం స్నానం అనుకొనేరు.. అదేనండీ హాఫ్ బాత్ . అమెరికాతో పరిచయం ఉన్న ప్రతీ వాళ్ళకీ .. ఈ హాఫ్ బాత్ తెలుస్తుంది. ప్లేస్ ఎక్కువున్న టెక్సాస్ లాంటి రాష్ట్రాల్లో తప్ప. హాఫ్ బాత్ అంటే మరేమీ లేదండీ.. బాత్రూం ఉంటుంది. కానీ, స్నానానికి సౌకర్యం ఉండదు అన్నమాట. కేవలం మల మూత్రాలకు మాత్రమే వీలుంటుంది. పూర్తి స్థాయి బాత్రూంలు మొదటి అంతస్తులో బెడ్ రూమ్ కి అటాచుడ్ గానో, డిటాచుడు గానో ఉంటాయి. నాకైతే ఇదేం గోల అనిపించింది. స్నానం చేయాలంటే మెట్లు ఎక్కాల్సిందే. మరి ఎక్కలేని నాలాంటి వాళ్ళ పరిస్థితి. అంతే సంగతులు , చిత్తగించవలెను. మెట్లు కనిపెట్టిన వాడిని నిజానికి షూట్ చేయాలి అన్నంత కోపం వచ్చింది. చాలామంది తెలుగు వాళ్ళ ఇళ్ళ పరిస్థితులు అంతే, ఓకే , నేనైతే గెస్ట్ ని . వచ్చి కంటెంట్ ఎలా ఉన్నా, కామెంట్ చేసి పోతాను. మరి మీ మీ ఇళ్ళల్లో ఉన్న ముసలి వాళ్ళ పరిస్థితి .. స్నానం అంటే, అలిసిపోయేలా మెట్లు ఎక్కటమేనా? మోకాళ్ళు నెప్పులు ఉన్నా, ఏ తుంటి ఏముకో విరగగొట్టుకున్నా ..? ఇలా అడిగితే , నాకు చాలా మంది ఇచ్చిన సమాధానం .. ఇక్కడ డిజైన్స్ ఇలానే ఉంటాయి. ఇవి అన్నీ ఒకలాగే అప్రూవుద్ .. హాలో .. ఇదే అమెరికా , అమెరికన్స్ విత్ దిజేబిలిటీస్ ఆక్ట్ ని ప్రవేశపెట్టి , ఇరవై ఐదేళ్ళ కాలంలో మొత్తం అమెరికాని  వికలాంగులకి, వృద్ధులకి, నడవలేని, చూడలేని , వినలేని ఎంతో మందికి సమూలంగా సౌకర్యంగా ఉండేలా మార్చేసింది. విషయం ఏమిటీ అంటే , మనం పట్టించుకోం .. ఏదో మనకో కాలు ఫ్రాక్చర్ అయి, రోజూ మేట్లేక్కటం లో నరకం చూస్తే తప్ప.

మా ఫ్రెండ్ ఒకాయన బాత్రూం కీ, కుటుంబాలకీ చాల సంబంధం ఉంది అనేవాడు .. అదేంటి బాబూ.. అదేం బాదరాయణ సంబంధం అంటే ..

" అంతే కదా పద్మా , పూర్వకాలంలో, బాత్రూమ్లు డిటాచుడుగా ఉండేవి, ఫ్యామిలీస్ అటాచుడ్ గా ఉండేవి. మరి ఇప్పుడో, బాత్రూమ్లు అటాచుడ్ మరియి కుటుంబాలు డిటాచుడు " అనేవాడు.. నిజమే కదా.. అనిపించింది. పక్కరూం లో ఉన్న కూతుర్ని , బ్రేక్ ఫాస్ట్ రెడీ అయింది అని ఎస్సెమ్మెస్ ద్వారా పిలిచే తల్లిని చూస్తే.

అయితే ఒక విషయం ప్రత్యకంగా చెప్పుకోవాలి. అమెరికాలో పెరుగుతున్న యువత, టీనేజ్ పిల్లల మీద నాకు చాలా చాలా ఆశ ఉంది. వాళ్ళ మానవత్వం మీద కూడా.. మదర్స్ డే గురించి యేవో మాటలు వచ్చి, వొక తల్లీ కూతురు ఉన్న దగ్గర, మదర్స్ డే గురించి నేను మాట్లాడితే..

ఆ అమ్మాయి వెంటనే అంది " ఆంటీ, ఇక్కడ పుట్టి పెరిగాను నేను. మదర్స్ డే నాకు కొత్తా కాదు, వింతా కాదు. కేవలం ఒక ఫేక్ట్. కొన్ని ఇబ్బంది కరమైన కుటుంబాల నుండి వచ్చిన నా ఫ్రెండ్స్ ఈ మదర్స్ డే ఇలా ఏదో ఒక కారణంగా, కొంచం శాంతిపూర్వక వాతావరణంలోకి వెళ్ళటం చూసాను నేను. మనకి ఇండియాలో పండుగలు అందుకే క్రియేట్ చేసారేమో అనిపించింది . నా వరకూ, నాకు మా అమ్మకీ ఎలాంటి కమ్యూనికేషన్ గ్యాప్ లేదు. నాకు ప్రతీ రోజూ మదర్స్ డే నే. ." ఏదైనా ఒక విషయం తాలూకా స్పిరిట్ ని అర్ధం చేసుకోగలిగి నప్పుడు , మనం ఎదుగుతాం .. అలాంటి అమ్మాయిలూ, వాళ్ళు సమాజానికి, కుటుంబాలకీ ఇచ్చే విలువల మీద నాకు గొప్ప పంచరంగుల కల ఏర్పడింది. ఎంత సంతోషంగా అనిపించిందో చెప్పలేను. అలాగే తెలుగు సినిమాల గురించి మార్లాడిన " అన్నపూర్ణ సుంకర " అనే అమ్మాయిని చూసినా , విన్నా.. ! ఒక మనిషి చాలు కదూ .. తనను ఇబ్బంది పెట్టిన విషయాలని ప్రశ్నించటానికి. " తల్లి దినం " ఎంట్రా .. తద్దినం లాగా .. అని జంధ్యాల జోక్ వెనుక ఉన్న ఆవేదన , ఏ దినానికైన ఆ స్పిరిట్ అర్ధం కాని మనుషుల కోసమని చెప్పినట్టు అనిపించింది.

తల్లి మనసుని అర్ధం చేసుకొని వాళ్ళు, ఎన్ని దినాలు జరిపినా అర్ధం చేసుకోరు.. తాగుబోతుల అయ్యప్ప దీక్షలా .. !

సోషల్ ఆక్టివిజం ..ఒక పవర్ఫుల్ టూల్ . అది పిచ్చోడి చేతిలో రాయి కాకుండా ఉండాలంటే, ఏ విషయం మీద విమర్శనైనా హుందాగా తీసుకొని.. మార్చగలిగిన విషయాలని మార్చే నేర్పు, వోర్పు, కాలం మన చేతిలో పెట్టుకోవాలి! మన జీవన నాణ్యత మీద నేను రాస్తున్న విషయాలని మీరు అంతే హుందాగా తీసుకొని సగం స్నానాన్ని కాకి స్నానంలా కాకుండా అసలు అభ్యంగనంలా మారుస్తారు కదూ.. !

మళ్ళీ మరిన్ని విషయాలతో , వచ్చే నెల ఇక్కడే .. ఇలాగే..

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments